సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 26 । జనవరి । 2025



సంక్రాంతి.. మన బులిరాజుదే
'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలో వెంకటేష్ కొడుకు బులిరాజు పాత్ర చేసిన **రేవంత్‌ది నిడమర్రు మండలం వానమిల్లి గ్రామం.** IIలో ▸



పోటెత్తిన శ్రీవారి క్షేత్రం
ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రం శనివారం భక్తులతో పోటెత్తింది. ఆలయంలోని అన్ని విభాగాలూ భక్తులతో కిటకిటలాడాయి. IIలో ▸



ప్రజల్లో పరివర్తన రావాలి
హెల్మెట్ ధారణ విషయంలో వాహనచోదకుల్లో పరివర్తన తీసుకురావాలని ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ అన్నారు. IIలో ▸

న్యూస్‌రీల్

ఘనంగా ఓటర్ల దినోత్సవం



సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం కలెక్టరేట్‌లో శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని డీఆర్వో మొగలి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటు వేసేలా ప్రోత్సహించడమే ఓటర్ల దినోత్సవం ముఖ్య ఉద్దేశమని ఆయన అన్నారు. ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఎక్కువ సార్లు ఓటు హక్కు వినియోగించుకున్న సీనియర్ సిటిజన్లను సత్కరించారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాచరచన, వక్తృత్వం పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు. కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, డ్వామా పీడీ అప్పారావు, డీఈఓ ఈ.నారాయణ పాల్గొన్నారు.

టీసీసీ సర్టిఫికెట్లు వచ్చాయ్

భీమవరం: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుల (టీసీసీ) పాస్ సర్టిఫికెట్లు భీమవరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పొందవచ్చని డీఈఓ ఈ.నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. గతేడాది ఏప్రిల్ జరిగిన డ్రాయింగ్ లోయర్, హయ్యర్, టైలరింగ్ పరీక్షల పాస్ సర్టిఫికెట్లు పొందవచ్చన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో సంప్రదించాలని కోరారు.

రేపు నిధి ఆప్ కే నికత్

రాజమహేంద్రవరం రూరల్: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌ఓ) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి నిధి ఆప్ కే నికత్–జిల్లా ఔట్ రీచ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నారు. ఏలూరులోని శనివారపుపేట పీఏసీఎస్, పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం సింగంపల్లి పీఏసీఎస్‌లో శిబిరాలు నిర్వహిస్తారు.

సేవలు దూరం..రైతుకు భారం

నిర్వీర్యమౌతున్న అగ్రి ల్యాబ్‌లు

- వ్యవసాయ, ఆక్వా, పాడి రైతులకు అండగా నిలిచిన గత ప్రభుత్వం
- విత్తనాలు, ఎరువులు, ఆక్వా సీడు, ఫీడు, దాణా పరీక్షలకు ల్యాబ్‌లు
- దాదాపు రూ.6 కోట్లతో జిల్లాలో 6 ల్యాబ్‌ల నిర్మాణం
- ల్యాబ్‌లను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- మూడుచోట్ల నిరుపయోగంగా ల్యాబ్‌లు
- మిగిలిన చోట్ల విత్తనాలు, నీటి శాంపిల్స్ పరీక్షలకే పరిమితి



సేవలు అందక.. వినియోగానికి నోచుకోక..

ఈ చిత్రాన్ని గమనించారా? నకిలీలతో వ్యవసాయం, ఆక్వా, పాడి రైతులు నష్టపోకూడదని గత ప్రభుత్వంలో నియోజకవర్గ కేంద్రం ఉండిలో నిర్మించిన డా.వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్. నియోజకవర్గంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఆక్వా చెరువుల్లోని నీరు, చేప పిల్లల సీడు, ఫీడు, పశువులకు అందించే దాణా, మందులను ఇక్కడ పరిశీలించి నాణ్యమైనవని నిర్ధారించిన తర్వాతనే డీలర్లు, వ్యాపారులు మార్కెట్‌లో రైతులకు అమ్మకాలు చేసేందుకు దాదాపు రూ.కోటి వ్యయంతో ఈ ల్యాబ్‌ను నిర్మించారు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో వినియోగానికి నోచుకోక ఇదిగో ఇలా నిరుపయోగంగా ఉంది.

సాక్షి, భీమవరం: పంటలు, ఆక్వా సాగులో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, సీడు, ఫీడు రాజ్యమేలుతున్నాయి. వీటిలో నాణ్యత ఏ మేరకు ఉందో తెలిపే ల్యాబ్‌లు పూర్తిస్థాయిలో అందుబాటులో లేక నకిలీలను వినియోగించి రైతులు నష్టపోతున్నారు. భూమిలోని పోషక లోపాలను గుర్తించి అవసరమైన మేరకు ఎరువులను వినియోగించేందుకు ఉపయోగపడే భూసార పరీక్షల నిర్వహణ మొక్కుబడితంతుగా సాగేది. వ్యవసాయశాఖ మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షలకు పంపినా పంట సగం పూర్తయ్యేసరికి ఫలితాలు రావడం వలన ఉపయోగం ఉండేది కాదు. ఈ నేపథ్యంలో రైతు సంక్షేమమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లకు శ్రీకారం చుట్టింది.

జిల్లాలో ఆరుచోట్ల.. సాగులో నకిలీ బెడదను అరికట్టి వారికి వెన్నుదన్నుగా నిలిచేందుకు ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లను గత ప్రభుత్వంలో ఏర్పాటుచేశారు. రైతులు శాంపిల్స్ తెస్తే చాలు వ్యవసాయం, మత్స్యశాఖ, పశు సంవర్ధక శాఖలకు సంబంధించి అన్ని పరీక్షలు ఇక్కడ ఉచితంగా నిర్వహించేలా ఒక్కో ల్యాబ్‌ను దాదాపు రూ.కోటికి పైగా వ్యయంతో రూపకల్పన చేశారు. తాడేపల్లిగూడెంలో రీజనల్ కోడింగ్ సెంటర్ (ఆర్‌సీసీ) ఉన్న నేపథ్యంలో జిల్లాలో మిగిలిన భీమవరం, ఉండి, నరసాపురం, తణుకు, పాలకొల్లులో, ఆచంట నియోజకవర్గానికి సంబంధించి మార్టేరులో అగ్రి ల్యాబ్స్‌ను నిర్మించారు. విత్తనాల స్వచ్ఛత, మొలక శాతం, తేమ శాతం పరీక్షించడం, ఎరువులు, ఆక్వా సీడు, ఫీడు నాణ్యమైనవిగా నిర్ధారణ అయిన తర్వాత మాత్రమే నియోజకవర్గంలోని రైతులకు అమ్మకాలు జరిగేలా చూడటం, నకిలీలను గుర్తిస్తే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం ఈ ల్యాబ్‌ల ముఖ్య ఉద్దేశం.



భీమవరం ల్యాబ్‌లో ఎరువుల పరీక్ష యంత్రం

మూడుచోట్ల విత్తన పరీక్షలతో సరి

ఎన్నికలకు దాదాపు ఏడాది ముందు భీమవరం, తణుకు, పాలకొల్లులోని ల్యాబ్స్‌ను ప్రారంభించారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఆక్వా తదితర పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఎక్విప్‌మెంట్‌ను గత ప్రభుత్వం అందజేసింది. తర్వాత ఉండి, నరసాపురం, మార్టేరులోని ల్యాబ్స్ నిర్మాణం పూర్తయ్యింది. పాలకొల్లులో కేవలం విత్తన మొలకశాతం పరీక్షలు మాత్రమే నిర్వహిస్తుండగా భీమవరంలో విత్తన మొలకశాతం, ఆక్వాకు సంబంధించి చెరువు నీటి శాంపిల్స్ పరీక్షలు చేస్తున్నారు. ఆయా ల్యాబ్స్‌లో ఫెర్టిలైజర్స్ శాంపిల్స్ పరీక్షించేందుకు సామగ్రి ఉన్నా బోరు నీటి సదుపాయం లేకపోవడంతో వినియోగానికి నోచుకోవడం లేదు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఉండి, నరసాపురం, మార్టేరులోని అగ్రి ల్యాబ్స్ నిరుపయోగంగా మారాయి.

వినియోగంలోకి తేవాలి



రైతులంటే కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్స్‌ను వినియోగంలోకి రాకుండా నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోంది. ల్యాబ్స్‌ను వినియోగంలోకి తెచ్చి నకిలీల సమస్యను అరికట్టాలి.

– వద్ది రఘురాం, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, తాడేపల్లిగూడెం

సామగ్రి రావాల్సి ఉంది



జిల్లాలోని కొన్ని ల్యాబ్‌లలో విత్తన పరీక్షలు జరుగుతున్నాయి. మిగిలిన చోట్ల పూర్తిస్థాయిలో సామగ్రి ఇంకా రాలేదు. ఈ విషయమై ఉన్నతాధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– జెడ్.వెంకటేశ్వరరావు, జేడీ, వ్యవసాయశాఖ



నరసాపురంలో తాళం వేసి ఉన్న ల్యాబ్

బుర్రకథ గానకోకిల మిరియాల

- 5 వేల ప్రదర్శనలతో రికార్డు
- అప్పారావును వరించిన పద్మశ్రీ
- గూడెం ఖ్యాతిపెంచిన కళాకారుడు



మిరియాల అప్పారావు (ఫైల్)

తాడేపల్లిగూడెం: చేతిలో తంబుర శృతి ఇస్తుంటే.. కాళ్లకు ఉన్న గజ్జెలు తాళం వేస్తుంటే.. ఒళ్లంతా అభినయిస్తూ.. కాళ్లను కదుపుతూ బుర్రకు పదును పెడుతూ.. బుర్రకథ చెప్పే నిష్ణాతుడు ఆయన. బుర్రకథ పేరు చెబితే నాజర్, రాణీలంక నిట్టల బ్రదర్స్ పేర్లు వినిపించేవి. తూర్పుగోదావరి జిల్లా నడుకుదురులో జన్మించిన మిరియాల అప్పారావు ఓనమాల రోజుల్లో గానాలాపన చేస్తూ, రాగాలప్పారావుగా ఖ్యాతిగడించారు. నాజర్ వంటి గురువుల వద్ద బుర్రకథలో మెలకువలను నేర్చుకుని అరంగేట్రంలోనే శభాష్ అనిపించుకున్నారు. అప్పారావు అమ్మమ్మ ఊరు నడకుదురు కాగా తండ్రిది రావులపాలెం. ఆయన కుమార్తె ఊరు తాడేపల్లిగూడెంలోనూ బుర్రకథ కళకు జవజీవాలిస్తూ తెలుగు రాష్ట్రాల్లో బుర్రకథ కళాకారులు సుమారు 70 శాతం మందికి గురువుగా ఎదిగారు. ఏడాదిలో సుమారు 300 ప్రదర్శనలు ఇచ్చిన చరిత్ర ఆయనది. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలతో పాటు సింగపూర్‌లోనూ ఆయన 5 వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చి అంతర్జాతీయ ఖ్యాతి గడించారు. గానకోకిల, బుర్రకథ టైగర్ వంటి బిరుదులను సొంతం చేసుకున్నారు. బుర్రకు పదునుపెట్టే కళను బుర్రకథగా రక్తికట్టించిన ఆయన ఇటీవల తాడేపల్లిగూడెంలో పరమపదించారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ముగ్గురు కుమారులు. వారసత్వంగా బుర్రకథను కుమార్తె యడవల్లి శ్రీదేవికి వరంగా ఇచ్చారు. గతంలో అప్పారావు వైఎస్‌ఆర్ అచీవ్‌మెంటు అవార్డును మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా అందుకున్నారు. మరణానంతరం పద్మశ్రీ పురస్కారాన్ని అందుకుని మరోమారు జాతీయస్థాయిలో పేరుగడించారు మిరియాల అప్పారావు.

భూముల విలువ పెంపునకు ఆమోదం



భీమవరం కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం: జిల్లాలోని భూముల మార్కెట్ విలువ పెంపుదలకు సమర్పించిన ప్రతిపాదనల తుది జాబితాను ఆమోదించినట్టు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాలోని 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా ఎలాంటి అభ్యంతరాలు నమోదు కాలేదన్నారు. జిల్లాలో భూముల విలువలను 10 శాతం నుంచి 20 శాతం వరకు పెంచుతున్నామని, వచ్చేనెల 1 నుంచి ఈ విలువలు అమలులోకి వస్తాయన్నారు. జిల్లా రిజిస్ట్రార్ ఎల్.వెంకటేశ్వర్లు, ఆర్డీఓ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, 15 మంది సబ్ రిజిస్ట్రార్స్ పాల్గొన్నారు.

పేదల బతుకులు బుగ్గిపాలు

- చిన్న నిర్లక్ష్యం.. 9 కుటుంబాలకు శాపం
- భైరవపట్నం అగ్నిప్రమాద బాధితుల ఆక్రందనలు
- సర్వం కోల్పోయిన వైనం
- క్షతగాత్రులకు గుంటూరులో చికిత్స
- గన్‌పౌడర్ కూడా పేలిందనే అనుమానం



అగ్నిప్రమాద బాధితులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్



ప్రమాదంలో కాలి బూడిదైన పూరిళ్లు



నిలువ నీడలేక చెట్ల కిందకు చేరిన బాధితులు

కైకలూరు: చిన్న నిర్లక్ష్యంతో క్షణాల్లో జరిగిన పొరపాటు తొమ్మిది కుటుంబాలకు నిలువ నీడ లేకుండా చేసింది. మండవల్లి మండలం భైరవపట్నం గ్రామంలో అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన నిర్వాసితులు చెట్ల కిందకు చేరారు. ఇదే ప్రమాదంలో ఒకే కుటుంబంలో ఆరుగురు కాలిన గాయాలతో గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో మూడేళ్ల బాలుడు నరకయాతన అనుభవిస్తున్నాడు.

35 ఏళ్లుగా గుడిసెల్లో.. ఆక్వా చెరువుల్లో చేపలు తినడానికి వచ్చే పక్షులను బెదిరించడానికి నక్కలోళ్లుగా పిలవబడే కొన్ని కుటుంబాలు సుమారు 35 ఏళ్లుగా భైరవపట్నం సమీపంలో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరి వద్ద నాటు తుపాకులు ఉంటాయి. ఉదయం ఆక్వా రైతుల వద్దకు వీరు పనికి తీసుకెళతారు. ప్రస్తుతం నెల్లూరు జిల్లా వెంకటాపురం చెముడుగుంటకు చెందిన తొమ్మిది కుటుంబాలు, సమీపంలో నెల్లూరుకు చెందిన మరో 14 కుటుంబాలు కలిపి మొత్తం 23 కుటుంబాల్లో సుమారు 120 మంది ఇక్కడ జీవిస్తున్నారు. నెల్లూరు ప్రాంతంలో వీరు పూసలు, దండలు విక్రయిస్తారు. షెడ్యూల్డ్ తెగలకు చెందిన వీరు ఆక్వా చెరువులపై పక్షులను బెదిరించే పనులకు ఈ ప్రాంతంలో అలవాటు పడ్డారు.

గన్ పౌడర్ ఉందా ? నక్కల కుటుంబాలు రోజూ చేపల చెరువులపై వాలే పిట్టలను బెదిరించానికి నాటు తుపాకీలు వినియోగిస్తారు. భాస్కరం వంటి ముడి పదార్థాలతో వీరే గన్‌పౌడర్‌ను రహస్యంగా తయారు చేస్తారు. అందరి వద్ద గన్‌పౌడర్ నిల్వ ఉన్న కారణంగానే ఇంత పెద్ద ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. అగ్నిమాపకశాఖ అధికారులు కూడా ఇదే అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్పీ పరిశీలన

అగ్నిప్రమాద ప్రాంతాన్ని జిల్లా ఎస్పీ కె.శివకిషోర్, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ తదితరులు పరిశీలించారు.

బాధితులను ఆదుకోవాలి

మండవల్లి: భైరవపట్నంలో అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఘటనా స్థలికి వెళ్లి బాధితులను పరామర్శించారు. గాయపడిన ఆరుగురికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని తహసీల్దార్ బి.గోపాల్‌ను కోరారు. నిరాశ్రయులైన తొమ్మిది కుటుంబాలకు తక్షణమే కావాల్సిన మౌలిక అవసరాలను అందజేయాలన్నారు. బాధితులకు అండగా ఉంటానని డీఎన్నార్ పేర్కొన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చేబోయిన వీర్రాజు, ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, జిల్లా ఆర్గనైజేషన్ కార్యదర్శి జయమంగళ కాసులు, మండల పార్టీ అధ్యక్షుడు బేతపూడి ఏసేబు రాజు, సీనియర్ నాయకులు కె.వాసురాజు, వి.యేసు, కె.రమేష్, ఎస్.అంజి, పి.అనిల్, ఫిర్దోజ్‌ఖాన్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

ప్రాణాలను కాపాడండి



అయ్యా.. తీవ్రంగా కాలిన మా బంధువుల ప్రాణాలను ముందు కాపాడండయ్యా. వీరిలో మూడేళ్ల బాబు ఉన్నాడు. 30 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. ఎప్పుడూ ఇటువంటి ప్రమాదం చూడలేదు. ఎక్కడ నుంచో వచ్చి ఇక్కడ బతుకుతున్నాం. మా వాళ్లను క్షేమంగా ఇంటికి పంపించండి.

– నక్కల మెటికరాణి, బాధితురాలు, భైరవపట్నం

డబ్బులు కాలిపోయాయి



పైసా.. పైసా కూడబెట్టిన డబ్బులు కాలిపోయాయి. నా కుటుంబం వీధిన పడింది. సమీపంలో చెట్టు నీడకు చేరాం. అపురూపంగా పెంచుకున్న కోళ్లు కాలిపోయాయి. ఒక్క రూపాయి కూడా లేదు. మాకు ప్రభుత్వం స్థలాలు కేటాయించి, ఇళ్లు కట్టించాలి. దాతలు ఆదుకోవాలి.

– నక్కా రోశి, బాధితుడు, భైరవపట్నం





గణతంత్ర వేడుకలకు ముస్తాబు



భీమవరంలో ముస్తాబైన కలెక్టరేట్ ప్రాంగణం, (ఇన్‌సెట్‌లో) కాంతులీనుతున్న కలెక్టరేట్

భీమవరం: భీమవరంలో కలెక్టరేట్ గణతంత్ర దినోత్సవాలకు ముస్తాబైంది. మూడు పెద్ద వేదికలు, రెండు చిన్న వేదికలు, గ్యాలరీ, 18 స్టాల్స్, తొమ్మిది శకటాలను సిద్ధం చేశారు. కలెక్టరేట్ భవనాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఏర్పాట్లను శనివారం జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రొటోకాల్‌కు అనుగుణంగా సిట్టింగ్, స్టేజ్ ఏర్పాట్లు చేశామన్నారు. ఆర్డీఓ కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.



క్లుప్తంగా

అబ్బురపరుస్తున్న అరటి గెల



అరటిచెట్టు కాండానికి గెల వేసిన దృశ్యం

పాలకొల్లు అర్బన్: అరటిచెట్టు చివరిలో గెల వేసి కాయలు కాయడం సాధారణంగా జరిగే ప్రక్రియ. అయితే అరటిచెట్టు కాండం మొదట్లో అరటిపండ్ల గెలవేయడం చాలా అరుదు. పాలకొల్లు పట్టణానికి చెందిన కంచర్ల రాజేష్‌కి నరసాపురం మండలం చిట్టవరంలో అరటితోట ఉంది. ఆ తోటలో అరటిచెట్టు కాండం మొదట్లో అరటిగెల వేసి అందర్నీ ఆబ్బురపరుస్తోంది. చుట్టుపక్కల రైతులు, స్థానికులు చూసి అబ్బురపడుతున్నారు.

పోటెత్తిన భక్తులు



భక్తులతో నిండిన దర్శనం క్యూలైన్లు

ద్వారకాతిరుమల : శ్రీవారి దివ్య క్షేత్రం శనివారం భక్తులతో పోటెత్తింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఉదయం నుంచే భక్తుల రాక ప్రారంభం కావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంతో పాటు, అనివేటి మండపం, దర్శనం క్యూలైన్లు, వైకుంఠం క్యూకాంప్లెక్స్, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాలు వేలాది మంది భక్తులతో కళకళలాడాయి.



ఇంకా ఎంత దూరం నడవాలి..

అర్హత ఉన్నా.. తప్పని అవస్థలు

కూటమి ప్రభుత్వం చేపట్టిన పింఛన్ వెరిఫికేషన్ కార్యక్రమంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ అర్హతను ప్రభుత్వానికి తెలియజేసేందుకు సహాయకులతో కలిసి ఆపసోపాలు పడుతూ శనివారం ఏలూరు జీజీహెచ్‌లో నిర్వహించిన శిబిరానికి హాజరయ్యారు. నిర్ధారణ పరీక్షకు హాజరుకాకుంటే పింఛన్ ఎక్కడ పోతుందోనని ఆందోళన చెందారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు



దృష్టిలోప పరీక్షకు హాజరైన పింఛన్‌దారులు



ఆర్థోపెడిక్ పరీక్షకు హాజరైన మహిళ

ఈ సంక్రాంతి.. మన బులిరాజుదే



- కొల్లేరు గ్రామం చానమిల్లి నుంచి టాలీవుడ్‌లో బుల్లి స్టార్‌గా
- అసలు పేరు రేవంత్.. నేడు అందరినోటా బులిరాజుగా గుర్తింపు
- నేడు భీమవరంలో సక్సెస్ మీట్‌లో సందడికి సిద్ధం

నిడమర్రు: ఈ ఏడాది సంక్రాంతికి థియేటర్లలో సందడి చేసిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం తొలి రోజు నుంచే బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టిస్తున్న విషయం తెలిసిందే. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేష్ హీరోగా విడుదలైన ఈ సినిమాలో అందరి కామెడీ ఒకెత్తయితే.. వెంకటేష్ కొడుకు బులిరాజు పాత్ర చేసిన కామెడీ మరో ఎత్తు. ఇంతకీ ఈ బులిరాజు పాత్ర చేసిన రేవంత్‌ది మన జిల్లానే. ఏలూరు జిల్లా నిడమర్రు మండలం చానమిల్లి అతని స్వగ్రామం. ఏమాత్రం సినిమా బ్యాక్‌గ్రౌండ్ లేని ఈ పదేళ్ల బాలుడు తన తొలి చిత్రంతోనే ఒకేసారి పాపులర్ అయిపోయాడు. సినిమాలో బులిరాజు ఎంట్రీ ఇచ్చాడంటే థియేటర్‌లో విజిల్స్ మోతెక్కిపోతున్నాయంటే ఆ పాత్ర ఏ స్థాయిలో జనానికి నచ్చేసిందో అర్థం చేసుకోవచ్చు. సినిమా రిలీజ్ తర్వాత సక్సెస్ మీట్‌లతో బిజీబిజీగా ఉన్న మన బులిరాజు ఆదివారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో సాయంత్రం 5.30 గంటలకు జరిగే సక్సెస్ మీట్‌లో చిత్ర బృందంతో కలసి సందడి చేసేందుకు చానమిల్లికి రాగా.. 'సాక్షి' పలుకరించగా వెల్లడించిన విశేషాలివీ..



సంక్రాంతికి వస్తున్నాం చిత్రంలోని ఓ సన్నివేశంలో..

గోదావరి స్లాంగ్‌తో అక్కడికక్కడే ఎంపిక

బులిరాజుగా గుర్తింపు పొందిన రేవంత్ పూర్తి పేరు భీమాల రేవంత్ పవన్ సాయి సుభాష్. బావాయిపాలెంలోని శ్రీచైతన్య స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. రేవంత్‌కి యూట్యూబ్ రీల్స్ చేయడం అలవాటు. ఇప్పటివరకు 20 రీల్స్ చేశాడు. పలు వీడియోలు డైరెక్టర్ అనిల్ వరకు వెళ్లడంతో.. రేవంత్ తండ్రికి ఫోన్ చేసి ఆడిషన్స్‌కి రప్పించారు. ఆడిషన్స్‌లో గోదావరి స్లాంగ్ మాట్లాడుతుండటంతో రేవంత్‌ని అక్కడికక్కడే ఎంపిక చేశారు. స్కూల్లో అందరినీ ఇమిటేట్ చేసే అలవాటు ఉంది. పవన్ కల్యాణ్ పాత్రలను ఎక్కువగా ఇమిటేట్ చేసేవాడు.

షూటింగ్‌లోనే యాక్టింగ్ ప్రాక్టీస్...

సినిమా కోసం యాక్టింగ్ స్కూల్లో చేర్పించాలని రేవంత్ తండ్రి అనుకోగా.. షూటింగ్‌లోనే ప్రాక్టీస్ చేయిస్తామని అనిల్, దిల్‌రాజు ప్రోత్సహించారు. కలలో కూడా సినిమాల్లో నటిస్తానని అనుకోని రేవంత్.. తొలిసారి సినిమాలో నటించే అవకాశం రావడంతో కంగారుపడ్డాడు. చిత్ర బృందం ప్రోత్సాహంతో ఉత్సాహంగా నటించగలిగాడు. హీరో వెంకటేష్ తనను కుటుంబసభ్యుడిలా ఆదరించారని రేవంత్ సంతోషం వ్యక్తం చేశాడు. 72 రోజుల షూటింగ్‌లో రోజుకు 10 నుంచి 12 గంటలపాటు తన తండ్రితో కలసి సెట్ వద్దే ఉండేవాడు. షూటింగ్ వల్ల 3 నెలలు పైగా స్కూల్‌కి దూరంగా ఉండాల్సి వచ్చింది. అయినా అతని తండ్రి, ప్రిన్సిపాల్ సహకారంతో నోట్సులు వాట్సాప్‌లో తెప్పించి చదివించారు.



కుటుంబ సభ్యులతో బులిరాజు

అవకాశాల వెల్లువ..

ఈ సినిమా తర్వాత రేవంత్‌కి 15 సినిమాల్లో, ఒక వెబ్ సిరీస్‌లో అవకాశాలు వచ్చాయి. భవిష్యత్తులో డాక్టర్ అయ్యి.. గ్రామీణ ప్రజలకు వైద్యసేవలందించాలనేది రేవంత్ లక్ష్యం. ఇకపై సినిమా అవకాశాలు వచ్చినా వేసవి, సంక్రాంతి సెలవుల్లోనే షూటింగ్ ప్లాన్ చేసుకుంటానని చెబుతున్నాడు. చదువును మాత్రం నిర్లక్ష్యం చేయనంటున్నాడు. రేవంత్‌కి సినిమాల్లోని ఫన్ పాత్రలంటేనే ఇష్టం. నీ కోసమైనా సినిమా మరోసారి చూస్తానని హీరో మహేష్‌బాబు అనడం మరిచిపోలేని విషయమని చెబుతున్నాడు.

పశు సంపద అభివృద్ధికి తోడ్పాటు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

పెనుగొండ: జిల్లాలో పశు సంపద అభివృద్ధికి, పశు రైతులకు అన్ని విధాలా సహాయ సహకారాలను అందిస్తామని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం ఆచంటలో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపూజ నిర్వహించి, పశువుల పరీక్షల నిర్ధారణలో వినియోగించే లేబరేటరీ పరికరాలను పరిశీలించారు. అలాగే అందాల దూడల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పుంగనూరు జాతీ మినియేచర్ ఆవుదూడ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సూడి ఆవులకు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో ఈనెలఖారు వరకు 183 పశు వైద్య శిబిరాలు నిర్వహించి, పశువులకు అవసరమైన మందులు అందిస్తున్నామన్నారు. పశుగణన పురోగతిలో ఉందని, ఫిబ్రవరి వరకూ కొనసాగుతుందన్నారు. రైతులకు విశేష సేవలందిస్తున్న పశువైద్యుడు డాక్టర్ ఫణికుమార్, డాక్టర్ తరంగణిలను ఘనంగా సత్కరించారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కే మురళీకృష్ణ మాట్లాడుతూ రైతులు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్ బాబు, ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, వైస్ ఎంపీపీలు వై నాగరాజు, టి శ్రీను, సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు, నీటి సంఘం ఛైర్మన్ ప్రసాద్ పాల్గొన్నారు.



అందాల పోటీలో పాల్గొన్న దూడలతో కలెక్టర్ నాగరాణి

పర్యావరణ రక్షణ పేరుతో కొల్లేరు ధ్వంసం

సీపీఎం నేత మంతెన ఆందోళన

భీమవరం : పర్యావరణ రక్షణ పేరుతో కొల్లేరు సరస్సును ధ్వంసం చేస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారామ్ ఆందోళన వ్యక్తం చేశారు. భీమవరంలో శనివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి బలరాం అధ్యక్షతన జరిగిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోనే ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడిన కొల్లేరు సరస్సు ప్రాంత ప్రజలు ఏళ్ల తరబడి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నేటి కొల్లేరులోని కాలుష్యం ప్రధానంగా పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల్లోని భారీ పరిశ్రమలు నుంచి పారిశ్రామిక వ్యర్థ జలాలే కారణమన్నారు. కొల్లేరు ప్రజలు వల్ల కాలుష్యం కావడం లేదని స్పష్టం చేశారు. ఫ్యాక్టరీలు నుంచి వచ్చే కాలుష్యాన్ని అరికట్టాలని ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వాలకు విజ్ఞప్తులు చేస్తున్నా పాలక వర్గాలు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని సీతారామ్ మండిపడ్డారు. 2006లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో వేలాది ఎకరాలు ఆక్వా చెరువులను అమానుషంగా అప్పటి ప్రభుత్వాలు రద్దు చేశాయని అవేదన వ్యక్తం చేశారు. 86వేల ఎకరాలు చెరువులు, 7,500 ఎకరాల సొసైటీ చెరువులు, 13 వేల జిరాయితీ భూముల చెరువులను అప్పటి ప్రభుత్వం ధ్వంసం చేసిందని గుర్తుచేశారు. కొల్లేరు భూములపై స్థానిక ప్రజలకే హక్కు ఉందని సరస్సును 5వ కాంటూరు నుంచి 3వ కాంటూరుకు కుదించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కొల్లేరు ప్రజలపై శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీర్పుపై ఇంప్లీట్ పిటిషన్ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని, కొల్లేరు ప్రజల ఉపాధిని కాపాడాలని సీతారామ్ డిమాండ్ చేశారు. కొల్లేరు సరస్సు కోసం ప్రజలు చేసే అన్ని పోరాటాలకు సీపీఎం అండదండలు అందిస్తుందన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ సీపీఎం జిల్లా మహాసభల్లో చర్చించిన మేరకు భవిష్యత్ పోరాటాలను నిర్మించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. ఉండి నియోజకవర్గంలో అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లు, చిరు వ్యాపారుల షాపులను తొలగించడం అన్యాయమన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు చింతకాయల బాబురావు, కేతా గోపాలన్, బి వాసుదేవరావు, కౌరు పెద్దిరాజు, దూసి కళ్యాణి, పొగాకు పూర్ణ, కేతా పద్మజ, జక్కంశెట్టి సత్యనారాయణ, సూర్నీడు వెంకటేశ్వరరావు, గొర్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సీతారామ్

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ 325 Sq.yds North Facing in Kranthi Nagar, Near Nove Engg. College (Now DPS School) Tangellamudi, Eluru, No. Agents. 9866661955. [SCA25001343]

LAND FOR SALE

■ ద్వారక తిరుమల నుండి 9 కి.మీ. దూరంలో పామ్ ఆయిల్ తోట(6 ఎకరాలు+బోర్) & 6 ఎకరాలు+బోర్ తో సిహెచ్.పోతెపల్లి గ్రామంలో అమ్మబడును. ఫోన్: 9581050803, 9182641766, 9533664222 [HA-3497]

Services

లాండ్రి అమ్మకము

■ ఏలూరు సత్రంపాడులో మంచి రన్నింగ్‌లో ఉన్న TUMBLE DRY డ్రైక్లీనింగ్ షాపు ఫ్రాంచేజీ అమ్మబడును. ఆసక్తి ఉన్న వారు సం.ప్ర. 70133 13071, 77000 06238 [P-772767]

BUSINESS OFFER

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషీన్, ప్లాస్టిగ్ ఉట్బోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 96430 10487, 8376089771, 011-25920179 [DA-6200]



Wanted

■ స్వంత బండి కలిగి ఉండి మైక్ పెట్టుకొని ఇంటింటికి తిరిగి ఆధృతి కంపెనీ ఇడ్లీ/దోశ పిండి అమ్ముటకు యువకులు కావలెను. సంప్ర: 89198 94063 [P-772847]

■ మీ ఇంటి వద్దనే ఉంటూ మీ మొబైల్ ద్వారా ప్రతి రోజు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3,500 సంపాదించుకోండి. వివరాలకు వాట్సాప్‌లో Hi అని మెసేజ్‌చేసి కాల్ చేయండి. 82478 08801. [M-0983571]

■ ప్రముఖ మైనింగ్ కంపెనీకి 5-10 సం॥ అనుభవం గల HR / ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్, టిప్పర్ IT డీజిల్ మెకానిక్స్-2, Sr & Jr ఎలక్ట్రీషియన్స్ -2 వెంటనే కావలెను. కేషవ్. 99894 88310 [B-454]

■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, దోస్త్ డ్రైవర్లు-3, హెల్పరు-5, 30 సం.లోపు జీ: 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 91771 77244 [B-1172677]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇండ్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికిస్త్రీలు/పురుషులు,ఆయా,నర్సులు,వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ:15 వేలు - 40వేలు,ఫ్రీరూం+భోజనం.HYD. 9666253675 [HA-99631]

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పెషేంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతిఫుడ్ జీ:20k ఫోన్: 8977639662, 8977639663 [SCA25001369]

■ సహస్ర ఓల్డేజ్‌హోమ్, YSRసర్కిల్ వద్ద విజయవాడ, పెద్దవారికి సేవ చేయుటకు ఆడా,మగ వర్కర్లు కావలెను. వయసు 20 నుండి 50 సం. Ph: 9652423559, 7093911010, 9573000987 [HA-1092]

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో లేడి వార్డెన్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు,భార్యాభర్తలు సెక్యూరిటీగార్డ్స్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-15309]

■ An ISO Certified Company Requires " Chief Managers-5 Nos., Rtd. in any Department Govt./Pvt. Managers-10 Nos., 40+, Good Package. K.Dhanumjaya ✆ : 94907 45099 [R-7101]

■ భీమవరం యమహా షోరూమ్ నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్ కావలెను. మరియు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (M/F) 10 కావలెను. కాంటాక్ట్ ✆ 97010 51199, 96185 55588 [SCA-25001399]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (హైదరాబాద్ బ్రాంచ్) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు / పేషంట్ల సేవకు వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్, భో+ వసతి +జీతం: 16-22000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్. ✆ 91332 71122, 95534 61177 [B-1266956]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (విజయవాడ బ్రాంచ్) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు / పేషంట్ల సేవకు వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్, భో+ వసతి +జీతం: 16-22000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 95420 47788, 92814 52843 [B-1266953]

■ సాయిరామ్ హోంకేర్: Hydలో బేబీ కేర్, పేషెంట్‌కేర్, ముసలివారిని చూసుకొనుటకు ఆయాలు/నర్సులు, ఇంటి పని/వంట పనికి మనుషులు (ఆడ/మగ) కావ లెను. జీతం 18,000/- 9666001826, 9666001827 [SCA25001357]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోమ్ Hyd & Vja బ్రాంచీలకు 10th ఆపై చదివిన20-50 సం॥ స్త్రీ/పు టెలికాలర్స్, సూ॥వైజర్లు, అడ్మిన్లు, అకౌంటెంట్లు,కా॥.భో+వ+జీ20-30వేలు . ఫోన్: 9491651122, 9491821122 [SCA25001389]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కవి ప్రసాద్‌కు జాతీయ ప్రతిభా పురస్కారం



విజయవాడలో పురస్కారం అందుకున్న కవి ప్రసాద్

తణుకు అర్బన్: తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ కవి వీఎస్‌వీ ప్రసాద్ తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. శ్రీశ్రీ కళావేదిక, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయెట్రీ అకాడమీ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్తంగా ఈనెల 21న విజయవాడలో నిర్వహించిన జాతీయ పురస్కారాల కార్యక్రమంలో ఈ ఘనత అందుకున్నట్లు ప్రసాద్ తెలిపారు. తెలుగు సాహిత్యాన్ని ఇనుమడింపచేయడంతోపాటు సమాజానికి తెలుగు వెలుగులు అందిస్తున్న నేపథ్యంలో ఈ గుర్తింపు లభించినట్లు వివరించారు. ఏపీఎస్పీఎఫ్ కమాండెంట్ డాక్టర్ కొండా నరసింహారావు, అలివేలు మంగదేవి, సాహితీవేత్త గరిమెళ్ల రాజేంద్రప్రసాద్, సమాచారశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.కొండలరావు, జి.ఈశ్వరిభూషణం, గీతా మహాలక్ష్మి చేతుల మీదుగా పురస్కారంతోపాటు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకున్నట్లుగా చెప్పారు.

మాజీ ఎమ్మెల్యే బాలరాజుకు మాతృవియోగం



తెల్లం మల్లమ్మ (ఫైల్)

బుట్టాయగూడెం: మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మాతృమూర్తి తెల్లం మల్లమ్మ(80) శనివారం సాయంత్రం మృతి చెందారు. తల్లి మృతితో బాలరాజు కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. మల్లమ్మ మృతిపై పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతాపం తెలిపారు. అలాగే ఏటీపీ నాయకులు మల్లమ్మ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు టౌన్: ఏలూరు శివారు వట్లూరు సమీపంలో రైలుకింద పడి ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధితులు తెలిపిన వివరాల మేరకు ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతానికి చెందిన షేక్ సుబానీ (39) భార్య పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. సుబానీ ఫైనాన్స్ పద్ధతిపై మంచాలు, కుర్చీలు విక్రయిస్తూ వారం వారం డబ్బులను వసూలు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి కారణాలు ఏమిటో తెలియదు కానీ వట్లూరు సమీపంలో రైలు పట్టాలపై వెళుతూ రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏడాదిపాటు ఆలపాటి శతజయంత్యుత్సవం



ఆలపాటికి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు డీఎన్నార్, జేపీ, పార్టీ నేతలు



సోమేశ్వరరావుకు ఆలపాటి అవార్డుతో సత్కారం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తమ తండ్రి ఆలపాటి రామచంద్రరావు శత జయంతి ఉత్సవాలను ఈ నెల 25వ తేదీ నుంచి ఏడాదిపాటు ఘనంగా నిర్వహించనున్నట్లు అంబికా సంస్థల చైర్మన్ అంబికా కృష్ణ తెలిపారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, కళాప్రియులు, సాహితీవేత్త అంబికా సంస్థల సృష్టికర్త ఆలపాటి రామచంద్రరావు 100వ జయంతి కార్యక్రమం స్థానిక పవర్‌పేటలోని అంబికా భవన్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబికా కృష్ణ మాట్లాడుతూ ఆలపాటి రామచంద్రరావు శత జయంతిని పురస్కరించుకుని కళాకారులను సత్కరించడంతోపాటు వివిధ సాంస్కృతిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కళారత్న కేవీ సత్యనారాయణతో చర్చించామని, త్వరలో ఈ కార్యక్రమాల వివరాలు వెల్లడిస్తామని అంబికా బ్రదర్స్ తెలియజేశారు. ఈ సందర్భంగా అంబికా కృష్ణ, అంబికా ప్రసాద్, అంబికా రాజాలకు కళారత్న కేవీ సత్యనారాయణ అభినందనలు తెలియజేశారు. అనంతరం ప్రముఖ మేకప్ కళాకారుడు, నాటక దర్శకుడు ఎంవీ సోమేశ్వరావును అంబికా సోదరులు ఆలపాటి రామచంద్రరావు కళాపీఠం రంగస్థల అవార్డుతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్నేహం సంస్థ సభ్యుడు మైలవరపు నరసింహం, వైఎంహెచ్ఏ సభ్యులు, సాహిత్య మండలి సభ్యులు, పలువురు ప్రముఖులు, అంబికా సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

ఆలపాటి రామచంద్రరావుకు నివాళులు

ఏలూరు టౌన్: ప్రముఖ వ్యాపారవేత్త, అంబికా సంస్థల అధినేత ఆలపాటి రామచంద్రరావు ఏలూరు నగరానికి విశ్వవ్యాప్తంగా ఖ్యాతి తీసుకువచ్చారని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఏలూరు సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ అన్నారు. ఆలపాటి రామచంద్రరావు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, జిల్లా ట్రేడ్‌యూనియన్ అధ్యక్షుడు పల్లి శ్రీనివాస్, నగర బీసీ సెల్ అధ్యక్షుడు కిలాడి దుర్గారావు, నగర గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు మద్దాల ఫణి, పార్టీ ముఖ్యనాయకులు ఉన్నారు.

జరిమానాలు కాదు.. ప్రజల్లో పరివర్తన రావాలి

కైకలూరు: హెల్మెట్ ధారణ విషయంలో వాహనదారులపై జరిమానాలు విధించడం కాకుండా ముందుగా వారిలో పరివర్తన తీసుకురావాలని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ చెప్పారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, కైకలూరు ఎమ్మెల్యే కామినేనితో కలిసి కైకలూరు సీఎన్నార్ గార్డెన్ నుంచి ట్రావెలర్స్ బంగ్లా వరకు హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. ట్రావెలర్స్ బంగ్లాలో కొల్లేరు ప్రజలకు హెల్మెట్ ధారణ ఆవశ్యకతపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ గతంలో రూ.100 జరిమానాను కేంద్రం రూ.1000కి పెంచిందన్నారు. ఎస్పీ కిషోర్ మాట్లాడుతూ రూ.1000 జరిమానా కంటే రూ.700తో హెల్మెట్ కొనుగోలు చేయడం ఉత్తమమన్నారు. ఫిబ్రవరి 1 నుంచి ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ వినియోగించాలన్నారు. దెందులూరు, ఉంగుటూరు ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు పాల్గొన్నారు. అనంతరం డీఐజీ, ఎస్పీలు కైకలూరు పోలీసు క్వార్టర్స్‌లో వివేకానంద విగ్రహం వద్ద మొక్కలు నాటారు. వాలీబాల్, షటిల్ కోర్టులను ప్రారంభించారు. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, సీఐలు, ఎస్సైలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న డీఐజీ, ఎస్పీ, ఎమ్మెల్యేలు

క్లుప్తంగా

లైఫ్ స్కిల్స్‌పై అవగాహన

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవిత విద్యార్థులకు లైఫ్ స్కిల్స్‌పై అవగాహన అందజేస్తున్నామని భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్కే బాలీశ్వరయ్య పేర్కొన్నారు. తీవ్ర వైకల్యం కలిగి ఉండి పాఠశాలకు రాలేని దివ్యాంగుల పిల్లలకు ప్రతి శనివారం ఇంటి వద్దే ప్రత్యేక విద్యతో పాటు, ఫిజియో థెరపీ, స్పీచ్ థెరిపి, లైఫ్ స్కిల్స్‌పై ప్రత్యేక ఉపాధ్యాయులచే అవగాహన కార్యక్రమాలు జరిగాయి. సమగ్ర శిక్ష ద్వారా ఉచితంగా ఉపకరణాలు అందజేస్తామని, ప్రత్యేక శిక్షణను తప్పక ఉపయోగించుకోవాలని, సమాజంలో ప్రతి ఒక్కరూ దివ్యాంగుల పిల్లలను ఆదరించాలని వివరించారు.

ఉచిత హోమియో మందుల పంపిణీ

అత్తిలి: పిఠాపురం శ్రీవిశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం నేతృత్వంలో ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో బల్లిపాడు గ్రామంలో శనివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ దండు పద్మావతి సౌజన్యంతో నిర్వహించిన ఈశిబిరంలో రోగులకు ఉచిత బీపీ పరీక్షలు చేసి, హోమియో మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఠం సభ్యులు పాల్గొన్నారు.

వరాల వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

అత్తిలి: ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామి వారి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, ఉదయం అర్చనలు జరిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారిని తులసిమాలలు, పలు రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పట్టింపాలెంలో దోమల నివారణ మందు పిచికారీ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పట్టింపాలెం గ్రామంలో శనివారం దోమల నివారణ మందు పిచికారీ కార్యక్రమం చేపట్టారు. గ్రామ సర్పంచ్ బొనిగే పోతన ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల ఉధృతి ఎక్కువగా ఉండటంతో దోమల మందు పిచికారీ చేయిస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

కుంచనపల్లి శ్రీవారి ఆలయానికి విరాళం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీదేవీ, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్లంబింగ్, ఎలక్ట్రికల్ పనుల నిమిత్తం వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం నాయుడు రూ.2లక్షలు విరాళాన్ని ప్రకటించారు. శనివారం ముందస్తుగా రూ.లక్షను ఆలయ కమిటి వారికి అందజేశారు. రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గొర్రెల శ్రీను, నాయకులు మాకరాజు సతీష్, ట్రస్ట్ కమిటి చైర్మన్ దాసరి మల్లిఖార్జునరావు, ఆలయ కమిటి ప్రెసిడెంట్ ఆత్కూరు వీరవెంకట పవన్‌కుమార్, సభ్యులు బాలగోపాల్‌రాజు, తాత నాగేశ్వరరావు, యాతం వీరన్న, జగదీష్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో సామాజిక తనిఖీలు

ఇరగవరం: జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం సామాజిక తనిఖీలు నిర్వహించి గ్రామ సభ నిర్వహించారు. తనిఖీ బృందంలోని అధికారులు మధ్యాహ్నం భోజనం పథకం అమలు, పాఠశాలకు విడుదలైన నిధుల సద్వినియోగంపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎన్ విజయసాగర్, బి బాల చెన్నయ్య ఉపాధ్యాయులు, విద్యార్థుల పాల్గొన్నారు.

నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలి

తణుకు అర్బన్: మంత్రి నారాయణకు చెందిన విద్యాసంస్థలను తక్షణమే సీజ్ చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి డిమాండ్ చేశారు. తణుకు ఎస్సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించిన తణుకు పట్టణ ఏఐఎస్ఏ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల కాలంలో నారాయణ విద్యాసంస్థల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కఠినచర్యలు తీసుకోవాలన్నారు. తణుకులో కూడా ప్రత్యేక తరగతుల పేరుతో పలు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఏ నాయకులు జి మనోజ్, యు.చరణ్, సీహెచ్ భబ్లు, ఎమ్ రాజేష్, ఎమ్ దీవెన్ రాజు, జి. చైతన్య పాల్గొన్నారు

జూద శిబిరంపై దాడి

అత్తిలి: మంచిలి గ్రామంలో పేకాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై పి ప్రేమరాజు చెప్పారు. శనివారం సాయంత్రం మంచిలి గ్రామశివారు పొలాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడి చేసి, పేకాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారివద్ద రూ. 5,650లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఎస్సై ప్రేమరాజు తెలిపారు.

ముమ్మరంగా వరినాట్లు

- నియోకవర్గంలో 95 శాతం వరినాట్లు పూర్తి
- బెంగాలీ కూలీల ఊడ్పులతో సకాలంలో దాళ్వానాట్లు

అత్తిలి: తణుకు నియోజకవర్గంలో దాళ్వా నాట్లు చివరదశకు చేరుకున్నాయి. తణుకు నియోజకవర్గంలో 48 వేల ఎకరాలలో దాళ్వాసాగు చేపట్టారు. సార్వాసీజన్‌లో వర్షాలు వరదల వల్ల వరికోతలు ఆలస్యం కావడంతో ఆప్రభావం దాళ్వాసాగు పనులపై పడింది. దాళ్వాసాగు పనులు ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ బెంగాలీ కూలీల రాకతో వరినాట్ల ప్రక్రియ చురుగ్గా సాగింది. ఇప్పటి వరకు 95 శాతం వరినాట్లు పూర్తిఅయ్యాయి. ఈనెలాఖరు నాటికి వరినాట్ల పూర్తిఅవుతాయని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. గత 10 ఏళ్లుగా బెంగాలీ కూలీలు ఈప్రాంతానికి వచ్చి వరినాట్లు వేయడంతో సకాలంలో సాగుపనులు జరుగుతున్నాయి. బెంగాలీ ఊడ్పుల వల్ల సాగు ఖర్చులు తగ్గడంతో పాటు, మంచి దిగుబడులు సాధించడంతో రైతాంగం బెంగాలీ కూలీలలో నాట్లు వేయడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రస్తుతం మంచువల్ల జింకులోపం వచ్చే అవకాశం ఉన్నందున చిలేటెడ్ జింక్‌ను స్ప్రే చేయడం ద్వారా జింకులోప నివారణను అధికమించవచ్చని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

దాళ్వాసాగులో ఎరువుల యాజమాన్యం...

భూసారాన్ని బట్టి రసాయనిక ఎరువుల మోతాదు నిర్ణయించి నత్రజని, భాస్వరం, పొటాష్,జింకు నిచ్చే ఎరువులను సమతుల్యంగా వాడాలి. నత్రజనిని కాంప్లెక్సు ఎరువుల రూపంలో గానీ, యూరియా రూపంలో గానీ వాడవచ్చు. నత్రజనిని మూడు సమాన భాగాలుగా చేసి, నాటడానికి ముందు దమ్ములోను, దుబ్బచేసే దశలోను, అంకురం దశలోను బురద పదునులో మాత్రమే సమానంగా వెదజల్లి 36–48 గంటల తరువాత పలుచగా నీరు పెట్టాలి. 50 కిలోల యూరియాకి 10 కిలోల వేపపిండి లేక 250 కిలోల తేమ కలిగిన మట్టిగాని కలిపి 2 రోజులు నిల్వ ఉంచి వెదజల్లితే నత్రజని వినియోగం పెరుగుతుంది.


అత్తిలి మండలం గుమ్మంపాడులో బెంగాలీ కూలీల వరినాట్ల దృశ్యం


అత్తిలి ప్రాంతంలో ఏపుగా పెరిగిన నారుమడి

సీఎం పర్యటన ప్రాంతాలను పరిశీలించిన జేసీ


తేతలిలో సీఎం పర్యటన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు

తణుకు అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వచ్చేనెల 1న తణుకు పర్యటనకు రానున్న సందర్భంగా తణుకులో ఆయా ప్రాంతాలను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి శనివారం పరిశీలించారు. ముందుగా హెలిప్యాడ్ ప్రాంతాన్ని ఎంపిక చేసేందుకు తణుకు ఎస్ఎన్‌వీఎం పాలిటెక్నిక్ కళాశాలలోను, ప్రత్యామ్నాయంగా తేతలి హైవే ప్రాంతంలో మరో హెలిప్యాడ్ ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం తేతలి పీఎంఏవై ఎన్టీఆర్ నగర్ లేఅవుట్‌ను రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి.రాజబాబుతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పర్యటనకు చేయవలసిన ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. సీఎం పర్యటనలో భాగంగా చేయాల్సిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయా శాఖ అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ చీఫ్ ఇంజనీర్ టి.పద్మనాభం, అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, ఆర్డీవో ఖతీబ్ కౌశల్ బానో, గృహ నిర్మాణ శాఖ జిల్లా గృహ నిర్మాణ శాఖాధికారి వై.హరిహరనాథ్, డీఈలు పిచ్చయ్య, బివి రమణ, ఎం.శ్రీనివాసరావు, తహసీల్దార్ దండు అశోక్ వర్మ, ఎంపీడీవో జయసాగర్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పేరుకే ప్రథమ పౌరులం

మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆవేదన

ఇరగవరం: పేరుకే ప్రథమ పౌరులం, కానీ పథకాలు, అభివృద్ధి పథకాలకు పనులకు సంబంధించి అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరగవరం మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపిపి కొప్పిశెట్టి అలివేలు మంగ తాయారు అధ్యక్షతన జరిగింది. అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి చేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని పలువురు వక్తలు కోరారు. ఎంపీటీసీలు మెట్ల కిరణ్మయి, మహలక్ష్మీ మాట్లాడుతూ అధికారులు ప్రజా ప్రతినిధులకు సర్వసభ్య సమావేశం ఉందని సమాచారం లేదు ఎందుకు చెప్పలేదు అని నిలదీశారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో ఎ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ సారికి ప్రజా ప్రతినిధులు అర్థం చేసుకోవాలని తర్వాత నుంచి అందజేస్తామని పేర్కొన్నారు. మళ్లీ ఇటువంటి పొరపాటు జరగకుండా చూస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పంచాయతీ కార్యదర్శులు అధికారులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ప్రజాప్రతినిధులు వాపో యారు. మండలంలో సమస్యలను పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలని కోరారు. విద్యుత్‌చార్జీలు పెంచమని అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు బాదుడే బాదుడుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్నారని సర్పంచ్ జగదీష్, కాకిలేరు ఎంపీటీసీ జవ్వాది ఫణి బాబులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకిలేరు ఎస్సీ, బీసీ కాలనీల్లో మంచి నీటి సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఆగ్రామంలో మంచినీటి సమస్యలను పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు కోరారు. ఎంపీటీసీ మంగెన రామానాయుడు మాట్లాడుతు ధాన్యం కొనుగోలు కూటమి ప్రభుత్వం రైతులకు ట్రాన్స్ పోర్టు చార్జీలు ఇంక ఇవ్వలేదని ఎప్పుడు ఇస్తారు అని అధికారులను నిలదీసారు. పలు శాఖలకు చెందిన అధికారులు జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. ఈ కార్యక్రమలో ఎంపీడీవో ఎ శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కోఆప్షన్ సభ్యులు మాబ్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ఇరగవరం సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

నిబంధనలు పాటిస్తేనే భద్రత


మాట్లాడుతున్న ఎంవీఐ సరేంద్ర సింగ్‌నాయక్

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాహనాలు నడిపేటప్పు డు ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించా లని మోటార్ వెహికల్ ఇనస్పెక్టర్ డి.సురేంద్ర సింగ్‌నాయక్ తెలిపారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలను శనివారం స్థానిక కడకట్ల రవాణాశాఖ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో డి.సురేంద్ర సింగ్‌నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలన్నారు. ఆదర్శ డ్రైవర్లుగా ప్రతి డ్రైవర్ నిలవాలని పిలుపునిచ్చారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు ఎంతో అవసరం అన్నారు. ఆటో డ్రైవర్లు, మ్యాక్సీ డ్రైవర్లు తదితరులు, సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతో పాటు సమయస్ఫూర్తి అవసరం


కొమ్మర జెడ్పీ ఉన్నత పాఠశాలలో మెరిట్ విద్యార్థులకు మెమెంటోలు అందజేస్తున్న మానవతా సంస్థ ప్రతినిధులు

అత్తిలి: విద్యార్థుల్లో చదువుతో పాటు వివేకం, సమయస్ఫూర్తి చాలా అవసరమని మానవతా సంస్థ అధ్యక్షుడు ముదునూరి బాలకృష్ణంరాజు అన్నారు. శనివారం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అత్తిలి మండలం కొమ్మర జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నైతిక విలువలు పెంపొందించుకోవడానికి ఆచరించాల్సిన పద్ధతులను వివరించారు. ఈసందర్భంగా బాలకృష్ణంరాజు మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ఉపాధ్యాయులు చెప్పే మంచి విషయాలను ఆచరించాలన్నారు. చిన్నతనం నుంచే సేవా భావాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. కెరీర్ గైడెన్స్ జిల్లా చైర్‌పర్సన్ కోడూరి రాధాపుష్పావతి మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌లు చూడటం మానుకోవాలన్నారు. సెల్‌ఫోన్‌ల వల్ల ఎన్నో దుష్పరిణామాలు కల్గుతున్నాయని చెప్పారు. ఈసందర్భంగా పాఠశాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ చైర్మన్ ఆనాల ఆదినారాయణరావు, కార్యదర్శి కొరిపల్లి హరి, కోశాధికారి కేవీ రామారావు, టీవీ సుబ్బారావు, అల్లబాని అప్పారావు, కఠారి శారదాదేవి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కొమ్మర జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు ముదునూరి బాలకృష్ణంరాజు అందజేశారు. ఇదే పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేసి, ఉపాధ్యాయ నియోజకవర్గ శాసన మండలి సభ్యునిగా వెళ్లిన ఆర్ గోపిమూర్తి అందజేసిన స్టడీమెటీరియల్‌ను పదో విద్యార్థులకు పంపిణీ చేసారు. పది పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మానవతా సంస్థ సెక్రటరీ కొరిపల్లి హరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తణుకు సబ్‌జైలును సందర్శించిన న్యాయమూర్తి


తణుకు సబ్‌జైలులో రిమాండ్ ముద్దాయిలకు అందజేస్తున్న ఆహారాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి పి.సాయిరామ్

తణుకు అర్బన్: నేరప్రవృత్తి బారినపడకుండా మంచి జీవితాన్ని గడిపేందుకు రిమాండ్ ముద్దాయిలు పాటుపడాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పాతర్లంక సాయిరామ్ అన్నారు. తణుకు సబ్‌జైలును శనివారం న్యాయమూర్తి సందర్శించి మాట్లా డారు. ముద్దాయిలకు అందజేస్తున్న ఆహార, వసతుల్లో నాణ్యత పాటించేలా జైలు అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ముద్దాయిలు అనారోగాల బారిన పడితే వెంటనే వైద్యసదుపాయాలు అందించాలని, ఒకసారి జైలుకు వచ్చిన వారు మళ్లీ రాకుండా ఉండేలా మంచి ప్రవర్తనతో మెలిగేందుకు కృషిచేయాలని అన్నారు. న్యాయవాదులను పెట్టుకునే స్తోమతలేనివారికి న్యాయసేవాధికార సంస్థ ఉచితంగా న్యాయవాదిని అందిస్తుందని చెప్పారు. అనంతరం ముద్దాయిలకు పెడుతున్న ఆహారాన్ని స్వయంగా రుచి చూశారు. ఈ కార్యక్రమంలో జైలు విజిటింగ్ న్యాయవాది డి.కృష్ణకుమారి, పారా లీగల్ వలంటీర్ ఎస్.వెంకటగిరి, న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, టి.సత్య నారాయణరాజు, ఎ.అజయ్ కుమార్, అంగజాల శివ, జైలు సూపరింటెండెంట్ మోహనరావు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి


తణుకుఅర్బన్: విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న ప్రిన్సిపల్ సుందరీబాయ్



జాతీయ ఓటర్ల దినోత్సవంలో పాల్గొన్న లయన్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం రూరల్: ఓటు హక్కు ప్రతీ ఒక్కరూ వినియోగించుకునేలా చూడాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటు కలిగిన పౌరుల్లో కొంత మంది క్యూలైన్లో నిలబడాలి అనే ఆలోచనతో తమ ఓటు హక్కును వినియోగించుకోవడం లేదన్నారు. ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బనో, మున్సిపల్ కమిషనర్ ఎం. ఏసుబాబు మాట్లాడుతూ బాధ్యత కలిగిన ప్రతీ పౌరుడు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, వెలుగు ఏపీఎం జీవీకే డీఎం.లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

అత్తిలిలో జాతీయ ఓటర్ల దినోత్సవం

అత్తిలి: ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని మంచి ప్రభుత్వం ఏర్పాటుకు సహకరించాలని తహసీల్దార్ దశిక వంశీ కోరారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం అత్తిలి తహసీల్దార్ కార్యాలయంలో అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో కూటమి నాయకులు ఆనాల ఆదినారాయణ, అల్తి సత్యనారాయణ, పూతినీడి శ్రీనివాస్, కాసగాని హనుమంతు, దాసం ప్రసాద్, తోటత్రిమూర్తులు పాల్గొన్నారు.

ఓటుపై అవగాహన అవసరం

తణుకు అర్బన్: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల ప్రిన్సిపల్ యు.లక్ష్మీ సుందరీబాయ్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కళాశాలలో విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ ఓటర్ దినోత్సవాన్ని లయన్స్‌క్లబ్ ఆఫ్ కైండ్‌నెస్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో పలు సెంటర్‌లలో ఘనంగా నిర్వహించారు. ముందుస్తుగా ఎస్‌వీ రంగారావు సెంటర్, టాటా మోటార్స్ వర్కు షాపు, సంత మార్కెట్, తదితర ప్రాంతాలలో జరిగిన కార్యక్రమంలో ప్రజలు ఓటింగ్ హక్కును సద్వినియోగం చేసుకోవాలని, రాజ్యాంగం పట్ల గౌరవం పెంపొందించుకోవాలని, దేశభక్తిని అలవర్చుకోవాలని తదితర అంశాలను అవగాహన కల్పించారు. క్లబ్ అధ్యక్షుడు గట్టిం ప్రవీణ్‌కృష్ణ, క్లబ్ డైరెక్టర్ కరిబండి రామకృష్ణ, కార్యదర్శి పిళ్ళ వెంకన్న బాబు, అసోసియేట్ సభ్యులు టి.పాండురంగారావు, సత్తి ఆదిత్య గౌతమ్ రెడ్డి, కర్రి నాగేశ్వరరావు, సత్తి సంపత్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన యూనివర్సిటీ..

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయంలో శనివారం జాతీయ ఓటర్లు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.



















